క్లుప్తంగా

ఘన సన్మానం



నెల్లూరు(బృందావనం): ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేసిన సయ్యద్ సిరాజ్‌ను పలువురు కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఆయన్ను రాజేంద్రనగర్‌లోని బదర్ మసీదులో బుధవారం సత్కరించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు షౌకత్, ఖలీల్ అహ్మద్, బాషా, డాక్టర్ హఫీజుల్లా, రఫీ, యాకూబ్, చాంద్‌బాషా, సిద్ధిఖ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ

పొదలకూరు: పర్యావరణ పరిరక్షణ, వనమహోత్సవంపై పట్టణంలో బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడదామంటూ నినాదాలు చేశారు. మొక్కలను చేత పట్టుకుని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశారు.

వరిలో ఆకునల్లిని నివారించుకోండి

కొడవలూరు: వరి పంటను ఆకునల్లి తెగులు ఆశించి ఉన్నందున నివారించుకోవాలని ఏఓ ఎస్.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని గండవరం, గౌతమ్ నగర్‌లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గండవరంలో ఆమె మాట్లాడుతూ ఆకునల్లి నివారణకు రెండు మిల్లీలీటర్ల ప్రొఫెనోపాస్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా నివారించుకోవాలన్నారు. లేనిపక్షంలో ఒక మిల్లీలీటర్ స్పైరోమెసిఫిన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా నివారించుకోవాలని చెప్పారు. కౌలు రైతులు సీసీఆర్ కార్డులు విధిగా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ టి.కవిత, రైతులు జగన్‌మోహన్‌రెడ్డి, ప్రదీప్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఊటుకూరులో..

విడవలూరు: మండలంలోని ఊటుకూరు గ్రామ రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి లక్ష్మి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరు శనగ పంటల్లో లింగాకర్షక బుట్టల ఆవశ్యకతను వివరించారు. అనంతరం గ్రామంలోని పలువురి వేరుశనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ప్రవీణ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో లాభాలు

మనుబోలు: శాస్త్రీయ పద్ధతులతో వ్యవసాయం చేస్తే అధిక లాభాలు గడించవచ్చని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని వెంకన్నపాళెం, మడమనూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు జరిపించుకుని భూమి స్వభావానికి అనుకూలమైన పంటలను సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలని, వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎరువులు, నీటి యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పొదలకూరు: మండలంలోని విరువూరు ప్రగతినగర్‌కు చెందిన బాలిక గత నెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. ఇంటర్ ఫెయిల్ కావడంతో బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



విడవలూరు: ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి వారిని రిలీవ్ చేయాలని బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ అన్నారు. మండలంలోని విడవలూరు, ఊటుకూరు కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో రెండో రోజు బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉపాధ్యాయులను ఇంకా రిలీవ్ చేయలేదని, దీనిపై వారికి ప్రత్యామ్నాయ చర్యలు చూపి తర్వాత రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం బీటీఏలో చేరిన పలువురు ఉపాధ్యాయులను జిల్లా గౌరవాధ్యక్షుడు పి.చిన్నయ్య అభినందించారు. అనంతరం మండలాధ్యక్షులు ఎస్.కిశోర్, కె.శంకరయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సామాజికంగా, సర్వీస్ పరంగా ఏ సమస్యలు వచ్చినా బీటీఏ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అనపల్ల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వై.చెంచుకృష్ణయ్య, ఎస్.బాలసుబ్రహ్మణ్యం, యు.వెంకటరావు, జి.గణపతి, ఆర్.మల్లికార్జునరావు, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

బారాషహీద్ దర్గాలో అన్ని సౌకర్యాలు



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గాలో ఈ నెల ఆరున ప్రారంభంకానున్న రొట్టెల పండగ సందర్భంగా పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చి.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కమిషనర్ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శానిటేషన్ విభాగంతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్కింగ్ వసతులతో పాటు దర్గా ప్రాంగణంలో అన్ని సౌకర్యాలను కల్పించాలని కోరారు. తాగునీటి సదుపాయం, ఉచిత వైద్య శిబిరాలు తదితరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. శానిటేషన్ విభాగ సిబ్బంది ఐదో తేదీ నుంచే విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. ఎంహెచ్ఓ చైతన్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, మలేరియా వైద్యాధికారి జిజియాబాయి తదితరులు పాల్గొన్నారు.

➡ నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను ఎగవేతదారులు, అనధికార.. నిబంధనలను ఉల్లంఘించి అదనపు అంతస్తులను నిర్మించిన యజమానులపై దాఖలు చేసిన కేసులను రాజీ చేసుకునేందుకు కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆస్తి పన్ను ఎగవేతదారులు 265 మంది.. 32 భవనాలకు సంబంధించిన వారిపై కేసులను నమోదు చేశామని, నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు హాజరై బకాయి మొత్తాన్ని అపరాధ రుసుముతో సహా చెల్లించి రాజీ చేయించుకోవాలని కోరారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు పాల్గొన్నారు.

➡ నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటిన్లలో నిర్దేశిత ప్రమాణాలను తప్పక పాటించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలోని అన్న క్యాంటిన్‌ను సందర్శించిన ఆయన ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం పొగతోటలో చేపట్టిన కాలువల పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను పర్యవేక్షించారు.

➡ నక్ష ప్రాజెక్ట్‌పై నిర్వహిస్తున్న శిక్షణ ద్వారా అధునాతన సర్వే సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నక్ష సర్వే ద్వారా భూ హద్దులు, సర్వే నంబర్లు తదితర వివరాలను నమోదు చేయనున్నామని చెప్పారు. సర్వే విధి విధానాలు.. సాంకేతికత.. నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే విధానం.. తదితరాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నిపుణులు వివరించారు.

బాబోయ్.. దుర్గంధం

- దుర్భర స్థితిలో పెద్దాస్పత్రిలోని మరుగుదొడ్లు
- జనరల్ మెడిసిన్ విభాగ వార్డులో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



బాత్‌రూమ్‌కు వెళ్లే దారిలో అంధకారం

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గల మరుగుదొడ్లు దుర్భరంగా మారాయి. దుర్గంధం వెదజల్లుతుండటంతో కొత్త వ్యాధులొస్తాయేమోనని రోగులు భయపడుతున్నారు. ఐపీ భవనంలోని జనరల్ మెడిసిన్ మహిళా వార్డు నుంచి కొంతమంది రోగులు పరిస్థితిని సాక్షికి ఫోన్ ద్వారా బుధవారం వివరించారు.

ఇదీ తీరు..

మహిళా వార్డును ఆనుకొని మూడు మరుగుదొడ్లు ఉండగా, రెండింట్లో నీరు రావడంలేదు. కుళాయిల్లో నీరొస్తున్నా, బకెట్ కానరావడం లేదు. ఒక చిన్న జగ్గు మాత్రమే దర్శనమిస్తోంది. మరో దాంట్లో బల్బు వెలగకపోవడంతో అక్కడికి రాత్రి వేళ వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. సకాలంలో ఇండెంట్ పెట్టి బల్బులు, బకెట్‌ను ఏర్పాటు చేయాల్సిన వార్డు నర్సులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి తలెత్తుతోంది. స్వీపర్లు వస్తున్నా, నీటి సమస్య నెలకొనడంతో కొద్దిసేపటికే దుర్గంధం వ్యాపిస్తోందని పేర్కొంటున్నారు. పెద్దాస్పత్రికి రెగ్యులర్‌గా ఉన్న సూపరింటెండెంట్ మూడు రోజుల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఈ తరుణంలో తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని రోగులు పేర్కొంటున్నారు.

ఘోరంగా ఉన్నాయి



“ నా భార్యకు యూరాలజీ సమస్య ఉండటంతో పెద్దాస్పత్రిలో అడ్మిట్ చేశా. బాత్‌రూమ్‌కు వెళ్లొచ్చాక దుర్గంధాన్ని భరించలేక ఆస్పత్రిలో ఉండలేనని రౌండ్స్‌కు వచ్చిన డాక్టరమ్మకే చెప్పింది. బాత్‌రూమ్‌కు వెళ్లే వారు ఎవరి జగ్గును వారే కొనుక్కొని జాగ్రత్త చేసుకోవాలని వైద్య సిబ్బంది చెప్తున్నారు. వైద్యసేవలు బాగానే అందుతున్నా, వసతులే ఘోరంగా ఉన్నాయి. అన్ని బాత్‌రూమ్‌లలో నీరొచ్చేలా చర్యలు చేపట్టాలి.

– గంగాధర్, మహిళా రోగి భర్త, సుందరయ్య కాలనీ

రాజకీయ క్రీడలో రాష్ట్రాన్ని బలి చేయొద్దు

నెల్లూరు రూరల్: తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ క్రీడలో ఆంధ్రాను బలి చేయొద్దని బీజేపీ నేత మిడతల రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. గోదావరి జలాలపై అభ్యంతరం తెలిపే హక్కు తెలంగాణకు లేదన్నారు. కాసా శ్రీనివాసులు, బుధవారపు బాలాజీ, నరాల సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణరావు, సోమా గోపాల్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి హోమ సప్తాహ మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకరమఠంలో కామ్య హోమ సప్తాహ మహోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల పది వరకు నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషా కుమారి దంపతులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమాలు, పారాయణం, సౌందర్యలహరి ప్రవచనలను నిర్వహించనున్నామని వివరించారు.

సహకార దినోత్సవాన్ని నిర్వహించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో కార్యక్రమాలను చేపట్టాలని డీసీఓ గుర్రప్ప ఆదేశించారు. నగరంలోని డీసీఓ కార్యాలయం నుంచి సహకారాధికారులు, సహకార సంఘాల సీఈఓలతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పలు కార్యక్రమాలను ఈ నెల ఆరు వరకు నిర్వహించాలని సూచించారు. సహకార పతాకాలను శనివారం ఆవిష్కరించి.. ప్రతిజ్ఞలు చేయించడంతో పాటు అవగాహన ర్యాలీలను జరపాలని ఆదేశించారు. డీసీఏఓ తిరుపాల్‌రెడ్డి, కావలి, కందుకూరు డివిజనల్ సహకార శాఖ అధికారులు రాజశేఖర్, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3500 ఎకరాల్లో ప్లాంటేషన్

నెల్లూరు (పొగతోట): ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 3500 ఎకరాల్లో నిమ్మ, మామిడి మొక్కలను నాటాలని డ్వామా పీడీ గంగాభవానీ ఆదేశించారు. డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు, ఈసీలు, టీఏలతో బుధవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు 2500 ఎకరాలకు గుర్తించామని, మిగిలిన వెయ్యెకరాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎంపిక చేసిన రైతుల పొలాల్లో ఫామ్‌పాండ్స్‌ను తప్పక తవ్వాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లక్ష కంపోస్ట్ పిట్లను లక్ష్యంగా నిర్దేశించామని వెల్లడించారు. ఉపాధి పనులకు హాజరయ్యే శ్రామికుల సంఖ్యను లక్షకుపైగా పెంచాలని ఆదేశించారు. సీతారామపురం తదితర మండలాల్లో పనులు చేయకుండానే పేమెంట్లు చేస్తున్న అంశంపై ఫిర్యాదులు అందుతున్నాయని, వీటిపై విచారణ జరిపి నివేదికలను పంపాలన్నారు.

ఆదాలతో భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు.



చక్రపాణి సేవలు అభినందనీయం



చక్రపాణి దంపతులకు సత్కారం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జూనియర్ అసిస్టెంట్ దద్దోలు చక్రపాణి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చక్రపాణి దంపతులను ఘనంగా సత్కరించిన అనంతరం పలువురు మాట్లాడారు. 43 ఏళ్ల పాటు ఆయన అందించిన సేవలను కొనియాడారు. శేషజీవితాన్ని సంతోషంగా గడపాలని కాంక్షించారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ నందన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహన్, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి, సూపరింటెండెంట్ నరేంద్ర, ఎంప్లాయీస్ అసోసియేషన్ నేత శీనయ్య, ఆర్వోలు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌లకు శిక్షణ



మాట్లాడుతున్న శైలేంద్రకుమార్

నెల్లూరు సిటీ: మహిళా సాధికారత – గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు అనే అంశంపై నెల్లూరు డివిజన్లోని మహిళా సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శైలేంద్రకుమార్ మాట్లాడారు. బ్రహ్మయ్య, సుల్తాన్, అజీజ్, శ్రీవిద్య, జిలానీబేగ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల మూత నేడు



మాట్లాడుతున్న అపస్మా నాయకులు

నెల్లూరు (టౌన్): ఆర్టీఈ చట్టం అమల్లో ప్రైవేట్ పాఠశాలల విషయంలో అధికారుల ఏకపక్ష నిర్ణయాలను నిరసిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలను మూసివేసి నిరసన తెలపనున్నట్లు అపస్మా, వివిధ సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక శెట్టిగుంటరోడ్డులోని నెహ్రూ నికేతన్ పాఠశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీఈ చట్టం అమలు చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన నిబంధనలననుసరించి ప్రైవేట్ విద్యాసంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయన్నారు. అయితే పాఠశాలల్లో అడ్మిషన్లు చేసే క్రమంలో అధికారులు తొందరపాటు చర్యలు తీసుకుంటూ యాజమాన్యాలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ప్రధానంగా గుర్తింపును రద్దు చేస్తామని చెప్పి నోటీసులు జారీ చేసి భయ పెడుతున్నారన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘాలు అపస్మా, ఇస్మా, యూనైటెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్, సీబీఎస్ స్కూల్స్ అసోసియేషన్ తదితర సంఘాలు సంయక్తంగా ఒక రోజు పాఠశాలలను మూసివేసి నిరసన తెలపాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో అపస్మా రాష్ట్ర సీనియర్ నేత ఎంవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర గౌరవ సలహాదారులు వెంకటరామయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటాద్రి, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణ, శ్రీచైతన్య పాఠశాలల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీసీ రాయ్ సేవలు ఆదర్శనీయం



సత్కారం అందుకున్న డాక్టర్లతో నిర్వాహకులు

నెల్లూరు(అర్బన్): దేశంలో వైద్య రంగానికి విశేష కృషి చేసిన డాక్టర్ బీసీ రాయ్ సేవలను డాక్టర్లు స్ఫూర్తిగా తీసుకోవాలని నారాయణ మెడికల్ గ్రూప్స్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకొని గాంధీబొమ్మ సమీపంలోని నారాయణ మల్టీ స్పెషాలిటీలో పలువురు డాక్టర్లను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, దయాడాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ శ్రీనివాస్, యూరాలజిస్ట్ యువరాజ్, కార్డియాలజిస్ట్ తిలక్‌కుమార్‌రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ హరికృష్ణారెడ్డి, గైనకాలజిస్ట్ శ్వేత, రేడియాలజిస్ట్‌లు కృష్ణతేజ, భావన, సురేఖను సన్మానించారు. పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, నేతలు దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాస్, మాలిని, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, దయాడాట్ ఫౌండేషన్ చైర్మన్ హుస్సేన్ కిర్మాని, రాఘవులు, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలకు డిమాండ్



డీఈఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు మైదానం లేదని.. అధిక ఫీజులను వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, యూనిఫారాలను విక్రయిస్తున్నారని చెప్పారు.

సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం



నెల్లూరు(బృందావనం): మిలటరీ కాలనీలోని సాల్వేషన్ ఆర్మీ – ఐసీటీ విలియమ్ బూత్ కోర్ప్స్‌లో సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జోసఫ్, సుశీల హాజరయ్యారు. తొలుత వ్యవస్థాపకులు విలియమ్, కేథిరిన్ చిత్రపటాలకు పుష్పాంజలిని సమర్పించి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చీరలు, దుప్పట్లు, లుంగీలు తదితరాలను పంపిణీ చేశారు. దాస్, కిశోర్, విజయబాబు, వినీత్, గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సుభద్ర కల్యాణం





నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చప్పరోత్సవం, సుభద్ర కల్యాణోత్సవాన్ని కనులపండువగా బుధవారం జరిపారు. ఉభయకర్తలుగా ఉగ్గుమూడి భాస్కర్, సృజన్, శ్రావణి, తీర్థ, తిరువత్తూరు అభిమన్యు, సత్యవతి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు.

రఘురామయ్యకు నివాళి



నెల్లూరు సిటీ: కందమూరుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత రఘురామయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన ఉత్తరక్రియలకు పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి హాజరయ్యారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, బండ్ల రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు గుణపాటి శ్రీనివాసులురెడ్డి, అంబటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పార్టీ రాష్ట్ర మహిళా జోనల్ అధ్యక్షురాలు, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు. సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

హోటల్లో చోరీ

నెల్లూరు సిటీ: హోటల్లో గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని మెక్లిన్స్‌రోడ్డుకు చెందిన జొహైబ్ హుస్సేన్.. వహబ్‌పేటలో పరివార్ ప్యారడైజ్ హోటల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హోటల్‌ను మంగళవారం మూసేసి ఇంటికెళ్లారు. హోటల్ వెనుక గ్రిల్స్‌ను తొలగించి లోపలికి దుండగులు ప్రవేశించిన అంశాన్ని బుధవారం వచ్చిన ఆయన గుర్తించారు. క్యాష్ కౌంటర్‌లోని రూ.4200ను చోరీ చేయగా, ఎనిమిది సీసీ కెమెరాలు.. నాలుగు టేబుల్ లాకర్లను ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి.. ఫోన్‌పేలో డబ్బులేయించుకొని

నెల్లూరు సిటీ: కత్తితో ఇద్దరు వ్యక్తులు బెదిరించి ఫోన్‌పేలో డబ్బులేయించుకున్నారంటూ వేదాయపాళెం పోలీసులకు బాధితుడు బుధవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. హరికృష్ణనగర్‌లోని వైష్ణవీ హోమ్ అపార్ట్‌మెంట్‌లో గల ఓ బొటిక్ సెంటర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన అన్సర్ ఏడేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వనంతోపు సెంటర్‌లోని ఓ వీధిలో రోడ్డు పక్కన గత నెల 25న ఉండగా, ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి రూ.వెయ్యి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వద్ద లేవని, ఫోన్‌పేలో ఉన్నాయని చెప్పడంతో వారి నంబర్‌కు ఈ మొత్తాన్ని వేయించుకున్నారు. నిందితుల మాటల బట్టి వారి పేర్లు రిక్సేన్, గోవర్ధన్ అని తెలిసిందని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రివ్యూల పేరిట నగదు కొల్లగొట్టి

నెల్లూరు సిటీ: హోటళ్లకు రివ్యూలిచ్చి.. ఆన్‌లైన్ ద్వారా నగదు సంపాదించొచ్చంటూ రూ.2.34 లక్షలను సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. దీనిపై వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. వివరాలు.. తెలుగుగంగ కాలనీలో నివాసం ఉంటున్న మహేంద్రబాబు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. పార్ట్‌టైమ్ జాబ్ పేరిట టెలిగ్రామ్ ద్వారా యాకర్ అనే గ్రూప్‌లో గతేడాది నవంబర్ 20న చేర్పించారు. హోటళ్లకు రివ్యూలు రాయాలని, దీనికి కమీషన్లను ఇస్తామని నమ్మబలికారు. దీంతో నాలుగు దఫాలుగా రూ.2.15 లక్షలను డిపాజిట్ చేయించుకున్నారు. అయితే నగదు విత్‌డ్రా కాకపోవడంతో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరిగి డబ్బులిస్తామంటూ రూ.18,215ను డిపాజిట్ చేయాలని సూచించడంతో ఆ మేరకు జమ చేశారు. చివరికి తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.